• తెలంగాణ జాగృతి నూతన కార్యాలయం ప్రారంభం


జాగృతి కార్యాలయంలో తెలంగాణ తల్లికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్సీ కవిత

# కేసీఆర్‌పై ఈగ వాలినా ఊరుకోం

- ఆయనకు నోటీసులివ్వడమంటే యావత్తు తెలంగాణకు ఇచ్చినట్టే
- ఇందుకు నిరసనగా 4న మహాధర్నా
- రేవంత్‌రెడ్డి తెలంగాణ సోయితో రాష్ట్రాన్ని పరిపాలించడం లేదు
- బీసీ బిల్లును ఆమోదించకుంటే బీజేపీకి సెగ తగిలేలా పోరాటం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్‌పై ఈగ వాలినా ఊరుకోబోమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ జూన్ 4న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేపడుతున్నట్టు ప్రకటించారు. శనివారం బంజారాహిల్స్‌లోని తన నివాసం సమీపంలో తెలంగాణ జాగృతి కొత్త కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. అంబేద్కర్, జ్యోతిబా పూలే, సావిత్రీబాయి పూలే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గోదావరి జలాల్లో 200 టీఎంసీల హక్కు తెలంగాణకు ఉండాలని కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని గుర్తుచేశారు. 'ఏటా 20 లక్షల ఎకరాలకు కాళేశ్వరం ద్వారా నీళ్లు అందించినందుకు కేసీఆర్‌కు నోటీసులిచ్చారా? తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా చేసిందుకా? రైతుబీమా, రైతుబంధు ప్రైవేశ పెట్టిందుకా..? నోటీసులు దేనికిచ్చారు?' అని ప్రశ్నిం చారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడమంటే యావత్తు తెలంగాణకు ఇచ్చినట్టేనని స్పష్టంచేశారు. కాళేశ్వరంపై వేసింది కాళేశ్వరం కమిషనా? లేక కాంగ్రెస్ కమిషనా? అని ప్రశ్నించారు.

## రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అనాలి

కేసీఆర్ తెలంగాణ సోయితో పరిపాలన చేశారని, రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అని అనకపోవడం మన ఖర్మ అని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి తెలంగాణపై సోయి తెచ్చుకుని జై తెలంగాణ అనాలని, అమరులకు నివాళులర్పించాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ పథకాలకు రాజీవ్ పేరా?

యువతకు స్వయం ఉపాధి కోసం అంటూ ప్రారంభిస్తున్న యువవికాసం పథకానికి రాజీవ్‌గాంధీ పేరు పెట్టడం ఏమిటని కవిత నిలదీశారు. దాన్ని తెలంగాణ యువవికాసంగా మార్చాలని లేదా శ్రీకాంతాచారి, యాదిరెడ్డి, కాళోజీ లేదా పీవీలో ఎవరి పేరైనా పెట్టాలని అన్నారు.

## బనకచర్లపై ఎందుకు స్పందించరు?

తెలంగాణ నీళ్లను ఏపీ తరలించుకుపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని కవిత ప్రశ్నించారు. ఏపీ సీఎం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు నిర్మించి నీళ్లు తరలించాలనుకుంటున్నా రేవంత్ కనీసం మాట్లాడడం లేదని మండిపడ్డారు. పక్క రాష్ట్రం ప్రయోజనాల కోసం ఎందుకు పనిచేస్తున్నారని రేవంత్‌రెడ్డిని నిలదీశారు. గోదావరి జలాల్లో తెలంగాణ వాటా కాపాడకపోతే జాగృతి పవర్ చూపిస్తామని హెచ్చరించారు.

## బీసీ బిల్లుపై బీజేపీ తాత్సారం

బీసీ బిల్లును ఆమోదించకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తాత్సారం చేస్తున్నదని కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీ బిల్లు కోసం ఏడాదిన్నరగా తెలంగాణ జాగృతి పోరాటం చేస్తున్నదని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. జాగృతి కార్యాలయ కార్యదర్శిగా పొన్నమనేని బాలాజీరావును నియమిస్తూ కవిత ఉత్తర్వులు జారీ చేశారు.

# నిర్బంధాన్ని ఎదురించి అస్తిత్వ పోరాటం

- రాష్ట్ర సాధనను ప్రజాస్వామిక హక్కుగా భావించినం
- నీళ్లు, నిధులు, నియామకాల్లో అన్యాయాన్ని ఎత్తిచూపినం
- టీజేఎఫ్ రజతోత్సవ సభలో వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం
- వేడుకలను ఏడాదిపాటు నిర్వహిస్తామని ప్రకటన


తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవ సభలో మాట్లాడుతున్న వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం నారాయణ, చిత్రంలో సీనియర్ జర్నలిస్టులు

హైదరాబాద్ మే 31(నమస్తేతెలంగాణ): 'తటస్థత, నిష్పాక్షికత అనే మాయ నుంచి బయటపడ్డం. తెలంగాణ అనే పదాన్ని నిషేధించిన రోజుల్లోనే తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం (టీజేఎఫ్)ను ఏర్పాటు చేసుకున్నం. భాష, సాహిత్యంలో వివక్షను బద్దలు కొట్టినం. నిర్బంధాలను ఎదురించి, అస్తిత్వ ఆకాంక్ష కోసం ముందుకు నడిచినం' అని టీజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం నారాయణ పేర్కొన్నారు. టీజేఎఫ్ స్థాపించి 25 ఏండ్లు పూర్తయిన సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని జలవిహార్‌లో రజతోత్సవాలను అట్టహాసంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వేలాదిమంది జర్నలిస్టులు తరలివచ్చారు. ముందుగా ఇటీవల మరణించిన సీనియర్ జర్నలిస్టులు మిర్యాల్‌కార్ సునీల్, మునీర్‌కు నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ.. ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారు పత్రికాధిపతులుగా ఉన్న పరిస్థితుల్లో తెలంగాణ ప్రాంతానికి చెందిన జర్నలిస్టులుగా అనేక గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నారని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు ప్రజాస్వామిక ఆకాంక్షగా భావించి ఉద్యమానికి నడుంబిగించామని తెలిపారు. 2001 మే 31న ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జర్నలిస్టులతో చిన్న సమావేశం ఏర్పాటు చేసి 'ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెస్' పేరుతో ఓ గ్రూప్‌ను ఏర్పాటు చేసుకొన్నామని, ఆ తర్వాత టీజేఎఫ్‌ను ఆవిష్కరించుకున్నామని గుర్తుచేశారు. యూనివర్సిటీల్లోని బుద్ధిజీవులు, విద్యార్థులు, లాయర్ల వెంట నడిచామని, ప్రజా సమూహాలకు నాయకత్వం వహించామని, అటు రాజకీయ పార్టీలు, ఇటు ప్రజాసంఘాల మధ్య సమన్వయ సాధనలో కీలక భూమిక పోషించామని చెప్పారు. రెండు వేల మంది పాత్రికేయులతో ప్రత్యేక రైలులో ఢిల్లీకి వెళ్లి ఒక పెద్ద మోర్చా జరిపామని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ పదం ఉచ్చరించలేని రోజుల్లోనే లాయర్లు, విద్యార్థులు, ఉద్యోగులను పిలిచి మాక్ అసెంబ్లీ ఏర్పాటు చేశామన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో జరిగిన అన్యాయాన్ని ఎత్తిచూపామని వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీలో దీక్షకు దిగిన విద్యార్థులకు సంఘీభావంగా నిలిచామని గుర్తు చేశారు. రోజుల తరబడి టెంట్లు వేసుకొని వారి వెంట ఉండి పోరాడామని తెలిపారు. జలీల్‌ఖాన్ ఆటోలో విద్యార్థుల కోసం ఆహారం తీసుకెళ్లామని గుర్తు చేసుకున్నారు. అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి నిర్బంధకాండను ఎదిరించి సింగరేణి ఏరియాల్లో యాత్ర చేశామని పేర్కొన్నారు. ఇలా అనేక చిక్కుల మధ్య అస్తిత్వ ఉద్యమం వెంట నడిచి, సఫలమయ్యేదాకా వెంటనడిచిన ఘనత టీజేఎఫ్‌కే దక్కిందని చెప్పారు. టీజేఎఫ్ రజతోత్సవాలను ఏడాదిపాటు నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది మే 31లోగా టీజేఎఫ్ విజయాలు, ఉద్యమంలో పోషించిన పాత్రను గుర్తుచేసుకొనేలా ఓ పుస్తకాన్ని తీసుకొస్తామని అల్లం నారాయణ ప్రకటించారు. చరిత్రను మననం చేసుకొనేందుకు వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది జర్నలిస్టులకు అభినందలు తెలిపారు.

## పాలకులను ప్రశ్నించేందుకు జేపీసీ అవసరం: దేవీప్రసాద్

ఉద్యోగ సంఘాలు, టీజేఎఫ్ ఏకమై ప్రత్యేక రాష్ట్ర పోరాటంలో ముఖ్యభూమిక పోషించాయని బీఆర్‌ఎస్ నేత దేవీప్రసాద్ గుర్తుచేశారు. సంఘం పెట్టేందుకు భయపడే రోజుల్లో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం పురుడుపోసుకున్నదని చెప్పారు. ఆనాడు ఉద్యోగులకు కొన్ని రాజకీయ పార్టీలు సహకరించకున్నా టీజేఎఫ్ మాత్రం అండగా నిలిచిందని గుర్తు చేశారు. నాడు సమైక్య పాలకులను ఎదురించేందుకు జేఏసీ ఏర్పాటు చేసినట్టుగానే ఇప్పుడు పాలకుల పనితీరును ప్రశ్నించేందుకు మరో జేఏసీ ఏర్పాటు చేయాల్సిన అవసరమున్నదని అభిప్రాయపడ్డారు. ఛత్తీస్‌గఢ్ అడువుల్లో ఆదివాసీ, మావోయిస్టులపై కేంద్రం సాగిస్తున్న మారణకాండను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో టీజేఎఫ్ పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. తెలంగాణ భావజాల వ్యాప్తిలో యూనియన్ ముందువరుసలో నిలిచిందని చెప్పారు. తెలంగాణ పోరాట చరిత్రను పుస్తకరూపంలోకి తీసుకురావాల్సిన అవశ్యకత ఉన్నదని, ఇందుకు జర్నలిస్టులే పూనుకోవాలని కోరారు. విమలక్క మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న దమన కాండను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామికవాదులు కేంద్రం తీరును వ్యతిరేకించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరాం, స్కైబాబా, దుర్గం భాస్కర్, ప్రహ్లాద్, రమేశ్‌హాజారే, రాజారాంయాదవ్, కిశోర్, కట్ట కవిత తదితరులు పాల్గొన్నారు.

# వాట్సాప్‌లో నాలుగు కొత్త ఫీచర్లు

న్యూఢిల్లీ: వాట్సాప్‌లో కొత్తగా నాలుగు ఫీచర్లు చేరబోతున్నాయి. కొల్లేజ్, మోర్ విత్ మ్యూజిక్, స్టిక్కర్స్, యాడ్ యువర్స్ అనే కొత్త ఫీచర్లు రాబోతున్నాయి. ఆరు ఫొటోలతో లేఅవుట్‌తో కొల్లేజ్‌ను రూపొందించవచ్చని మెటా తెలిపింది. ఎడిటింగ్ టూల్స్‌తో స్టేటస్‌లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకోవచ్చు. 'మోర్ విత్ మ్యూజిక్' ద్వారా వాట్సాప్ యూజర్లు పాటను నేరుగా స్టేటస్‌గా పెట్టుకోవచ్చు. 'స్టిక్కర్' ఫీచర్ ద్వారా ఫొటోలను స్టిక్కర్లుగా మార్చుకోవచ్చు. 'యాడ్ యువర్స్' ఫీచర్ ద్వారా స్టేటస్ సంభాషణలో స్నేహితులను చేర్చుకోవచ్చు.

# • అనంతగిరిలో 9వ శతాబ్ది గుహలు



*హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా అనంతగిరిలో 9వ శతాబ్దానికి చెందిన 15 జైన గుహల సముదాయాలను కాపాడుకోవాలని ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో, పురావస్తు పరిశోధకడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి కోరారు. శనివారం ఆయన అనంతగిరిలోని గుహలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆ గుహలు 2.0 నుంచి 6.0 మీటర్ల పొడవు, 2.0 నుంచి 3.0 మీటర్ల వెడల్పు 2.5 మీటర్ల ఎత్తు కలిగి తూర్పు వైపు ద్వారంతో నేలపై రాతి పడకలు కలిగి ఉన్నాయని వివరించారు. వర్షాకాలంలో జైన మునులు ఈ గుహలలో నివసించేవారని, రాతి పడకలపై మరణించేంత వరకు ఆహారం తీసుకోకుండా సల్లేఖన వ్రతాన్ని ఆచరించేవారని తెలిపారు.*

# పాల్వంచలో ఒకరికి కరోనా!

పాల్వంచ రూరల్, మే 31 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్‌లో పనిచేస్తున్న ఓ కార్మికుడికి కరోనా సోకిందనే వార్త శనివారం కలకలం సృష్టించింది. అతడు క్వారంటైన్‌లో ఉండాలని కేటీపీఎస్ అధికారులు తెలిపారు. పూర్తి నిర్ధారణ కోసం బయట దవాఖానల్లో పరీక్షలు చేయించుకోవాలని అధికారులు బాధితుడికి సూచించారని సమాచారం.

# ఓహెచ్‌ఈ లైన్ వైర్ తెగి నిలిచిన రైళ్లు

డోర్నకల్ , మే 31 : సీతారామ ప్రాజెక్టు కెనాల్ పనుల్లో భాగంగా శనివారం గార్ల-డోర్నకల్ రైల్వే స్టేషన్ల మధ్య ఐసోలైట్ రాడ్ తగిలి ఓహెచ్‌ఈ (ఓవర్ హెడ్ ఎలక్ట్రిసిటీ లైన్ ) వైర్ ఎగువ లైన్‌లో సాయంత్రం 5 గంటల ప్రాంతంలో తెగిపోయింది. దీంతో తిరుపతి నుంచి ఆదిలాబాద్ వెళ్లే కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలు డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో గంటపాటు నిలిచిపోయింది. లక్నో ఎక్స్‌ప్రెస్ రైలును 40 నిమిషాలు నిలిపివేశారు. రైల్వే అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయడంతో రైళ్లు యథావిధిగా నడిచాయి.

# 8 మంది మావోయిస్టుల లొంగుబాటు

### ఒక్కొక్కరికి రూ. 25 వేల ఆర్థికసాయం అందజేత

ములుగు, మే 31 (నమస్తేతెలంగాణ) : ఎనిమిది మంది మావోయిస్టులు శనివారం ములుగు ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ ఎదుట లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్రకు చెందిన వారికి ప్రభుత్వ సాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేలు అందించినట్టు ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన వారిలో డివిజన్ కమిటీ సభ్యుడు దొర్పెట్టి మిర్గు, ఏరియా కమిటీ సభ్యురాలు మడవి టిడ్గో, ఏరియా కమిటీ సభ్యుడు మిడియం బీమాతో పాటు సభ్యులు ఉయిక అనిత, మడకం కమలేశ్, సోయం భీమే, మడవి మడక, మడవి ఇడుమ ఉన్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎస్పీ రవీందర్, సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.